


అల్లూరి వర్ధంతి సందర్భంగా వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


ఎస్.సొసైటీ ఆధ్వర్యంలో దుడ్డుకల్లు పంచాయితీ కొత్తవలసలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభ నిర్వహించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఈనెల 7న అమరుడై నేటికీ వంద సంవత్సరాలు పూర్తి అయిందని ఎస్ సొసైటీ నిర్వాహకులు షేక్ గౌస్ తెలిపారు. స్వాతంత్ర సమరయోధుడు, గిరిజన, బడుగు జీవుల కోసం ఉద్యమించిన గొప్ప వీరుడు, ఎందరో గిరిజన యువతన స్వాతంత్ర్య సమరం వైపు నడిపిన వ్యక్తి అని, అలాంటి మహనీయుని వందో వర్ధంతి సందర్భంగా ఆయన పోరాటాలు, త్యాగాన్ని స్మరించుకోవడం ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను స్మరిస్తూ వ్యాస రచన, వక్తృత్వ (డిబేట్), డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

వరహాల గెడ్డ ఆక్రమణల పేరిట వసూళ్ల పర్వం

- 24అక్రమ కట్టడాలకు మున్సిపాలిటీ నోటీసులు
- అధికారపార్టీ నాయకుడి ఆదేశాలతోనే..
- లక్షల్లో వసూలు చేశారనే ఆరోపణలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరిగాయి. టౌన్ ప్లానింగ్ శాఖ అనుమతులు లేని పెద్ద పెద్ద భవనాలు బడాబాబుల చేతుల్లో వున్నాయి. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కాలువలు ఆక్రమించి ఇష్టారాజ్యంగా చేసిన నిర్మాణాలు కళ్ల ముందే కనిపిస్తున్నాయి. ఇంతవరకు ఏ అక్రమ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసిన దాఖలాల్లేవు. అయితే కొద్దిరోజుల క్రితం పట్టణంలోని సర్వే నెంబర్ 151 వరహాల గెడ్డ పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. మున్సపల్ చట్టం 1965 లోని సెక్షన్లు 192, 360, 361, 385 ప్రకారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నోటీసులు జారీ చేశారు. మొత్తం 24మంది అక్రమ కట్టడాలు చేసిన వారికి నోటీసులు జారీ చేశారు. కీలకమైన పదవిలో ఉన్న ఒక అధికారపార్టీ నాయకుడి ఆదేశాలతోనే ఈ నోటీసులు బాగోతం నడిచినట్లు తెలుస్తోంది. భూముల జంతర్ మంతర్ వ్యవహారాల్లో ఆరితేరిన ఓ అధికార పార్టీ పట్టణ నాయకుడి సలహా మేరకు ఈ నోటీసులు జారీ చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నోటీసుల జారీ వెనుక పెద్ద ఎత్తున వసూళ్ల పర్వం సాగిందనే ప్రచారం జరుగుతోంది. నోటీసు అందుకున్న ఒక్కో అక్రమ నిర్మాణదారుడి నుంచి మున్సిపల్ అధికారులు రూ.2లక్షల చొప్పున వసూలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు 50లక్షల వరకు అధికారులు వసూలు చేసి తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా పంచుకున్నారనే గుసగుసలు గుప్పుమంటున్నాయి. పట్టణ పరిధిలో వందల సంఖ్యలో అనుమతుల్లేని అక్రమ కట్టడాలు, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు వుండగా కొద్ది మందికే నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమవుతోంది. అధికారపార్టీకి చెందిన భూ అక్రమార్కుడు సూచనల మేరకే నోటీసులు జారీ చేసిన అధికారులు మున్ముందు ఇంకెంతమందికి నోటీసులు జారీ చేస్తారోనన్న చర్చ జరుగుతోంది. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పక్కన పెట్టి అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు మున్సిపల్ అధికారులు ఈ నోటీసుల జారీ బాగోతానికి తెరలేపారనే ప్రచారం సాగుతోంది. గడచిన మూడు నెలలుగా మున్సిపల్ సమావేశం నిర్వహించకుండా దాటవేస్తున్న అధికారులు వసూళ్ల పర్వంలో తలమునకలై వున్నట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరితో సహా వైసిపి కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకుండా అధికారులు అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లో పని చేస్తుండడం వివాదాస్పద మవుతోంది.



అక్రమ నిర్మాణదారులకు మున్సిపల్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, తోటపల్లి కాలువ ఆయకట్టు రైతులు

మా భూమికి నీరివ్వరా?

కాలువలకు మరమ్మతులు చేసి సాగు నీరందించాలి

రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

తమ భూములకు ఎప్పటికీ తోటపల్లి నీరివ్వరా? తక్షణమే కాలువల మరమ్మతులు చేసి నీరివ్వండి అంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పాలకొండ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక దుర్గ గుడి సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ పాలకొండ, వీరఘట్టం, జియ్యమ్మవలస మండలాల్లో దాదాపు 33 గ్రామాల పరిధిలో 8550 ఎకరాలకు తోటపల్లి ప్రాజెక్టు ఆయకట్టుకు గత కొన్నేళ్లుగా సాగునీరు అందడంలేదని, దీనివల్ల పంటలు పండక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పెద్దబుడ్డిడి వద్ద సైఫాన్ పాడై దశాబ్దాలు దాటినా ఇంతవరకు దాన్ని మరమ్మతులు చేయడం లేదన్నారు. కాలువ లైనింగ్ మరమ్మతులు చేయకపోవడం వల్ల ఆ పేరు చెప్పి ఏళ్ల తరబడి సాగునీరు ఇవ్వకుండా రైతులను ప్రభుత్వం నష్టపరుస్తుందని అన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించమనిఇరిగేషన్ అధికారులు అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఈ ఏడాది ఇంతవరకు కాలువల పని ప్రారంభించనే లేదని అన్నారు. తమ భూములకు ఈ ఏడాది కూడా సాగునీరు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని, ఇది రైతుల్లో తీవ్రమైన ఆందోళన కలిగిస్తుందని అన్నారు. తోటపల్లి ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీరు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతు ఉద్యమం ఐక్య పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయంలో ఎఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, యిద్దు బోయిన సింహాద్రి, గంగుల శ్రీనివాసు, బోనమంతుల సోమశేఖర్, కర్ణం రవి, దుప్పాడ గౌరి నాయుడు, రౌతు స్వామి బాబు ,పడాల రామచంద్రరావు, వెన్నపు నారాయణరావు, కొండ్రు సింహాచలం, ఎల్.సంగంనాయుడు, ఎల్.నారాయణ రావు, గుంటుపల్లి కృష్ణ, మునుకోటి అప్పన్న, మునుకోటి శంకర్రావు, ఎం.సత్యారావు, సూర్యనారాయణ, నరసింహ పాణిగ్రహి తదితరులు రైతు సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు ఇచ్చారు. ధర్నాకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, వ్యవసాయకార్మిక సంఘ నాయకులు దూసి దుర్గారావు మద్దతుగా పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కొమరాడ

క్షేత్రస్థాయిలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆదేశించారు. మండలంలోరి కూనేరు రామభద్రపురం పిహెచ్‌సిని మంగళవారం సందర్శించి ఆశాడే కార్యక్రమంలో పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో వైద్య సేవలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. ఆశాడే అజెండా అంశాలపై సమీక్షించారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో వయస్సుకు తగ్గట్టుగా వారి ఎదుగుదల తీరును గమనించాలని, ఏవైనా లోపాలను, వ్యాధులను గుర్తిస్తే జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి (డిఈఐసి) రిఫర్ చేయాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గిరిశిఖర గర్భిణీలను కాన్పు తేదీకి నెల ముందుగానే వసతి గృహంలో (వైటిసి) చేర్చాలన్నారు. ఇ-ఆశా యాప్‌లో కొత్తగా పొందుపర్చబడిన సర్వే రికార్డులపై పునఃచరణ చేశారు. సర్వే వివరాలు పక్కాగా నివేదించాలన్నారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే ద్వారా జ్వరాలను సకాలంలో గుర్తించాలన్నారు. ఎన్సిడీ సర్వే పారదర్శకంగా చేపట్టి దీర్ఘకాలిక రోగులను గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బి.శామ్యూల్, డాక్టర్ గణేష్ పట్నాయక్, డెమో సన్యాసిరావు, సిహెచ్ఒ బంగారుబాబు, సిసి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

కిశోర వికాసం తరగతుల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సోమగండి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న కిశోర వికాసం వేసవి శిక్షణా తరగతులను ఆర్‌జెడి చిన్మయిదేవి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10 వరకు వేసవి శిక్షణా తరగతులు జరుగుతాయని తెలిపారు. ఇవి పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలకు కిశోర్ వికాసం గురించి వివరించారు. వారికి కావాల్సిన పౌష్టికాహారం గురించి తెలిపారు. కిశోర్ వికాసం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కౌమార దశలో బాలికలు అవసరాల గురించి తెలిపారు. శిక్షణా తరగతుల్లో ఎర్రకువారిగూడ, అక్కన్న గూడ బాలికలు పాల్గొన్నారు. అలాగే కొత్తూరు, భామిని మండలాల్లో శిక్షణా తరగతులను సందర్శించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కనకదుర్గ, సిడిపిఒ పి.రంగలక్ష్మి, సూపర్వైజర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

భామిని : బాలికల ఆరోగ్యం పట్ల, పరిశుభ్రతపట్ల ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ చట్టాలు పట్ల, లింగ వివక్ష పట్ల అవగాహన కలిగివుండాలని ఐసిడిఎస్ ఆర్‌జెడి జి.చిన్మయి దేవి అన్నారు. భామిని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర దశ బాలికలకు కిషోర్ వికాసం -వేసవి సెలవులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌమార దశ బాలికలకు, వ్యక్తిగత శుభ్రత పట్ల, రక్తహీనత పట్ల, బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన పోస్కో చట్టం పట్ల, లింగ వివక్ష పట్ల, విద్యా నైపుణ్యాల అభివద్ధి, ఉన్నత ఆలోచనలు కలిగి ఉండడం, బాల్య వివాహాల గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కనకదుర్గ, సీతంపేట సిడిపిఒకనకమహాలక్ష్మి, మహిళా పోలీస్ చందన, భామిని సిడిపిఒ శాంతి భవాని, అంగన్వాడీ సిబ్బంది వరలక్ష్మి, సబిత వున్నారు.



భామినిలో జరిగిన శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌జెడి చిన్మయిదేవి

కురుపాం : కిశోర బాలికల అభివృద్ధి, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిడిపిఒ పైల జానకమ్మ అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం పంచాయతీల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక విద్య, బాల్యవివాహాలు పునరుత్పత్తి ఆరోగ్యం-ప్రభావాలు, పిల్లల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ తదితర కిశోర వికాసంపై వేసవి శిక్షణ అంశాలను గూర్చి అంగన్వాడి సిబ్బందికి అవగాహన కల్పించారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

తమ హక్కుల కోసంగత వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌వోలు హెల్త్ సూపర్వైజర్లపైనా, ఎఎన్ఎంలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వెంటనే వారు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ జెఎసి నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక ఎపి ఎన్జీవో హోంలో జిల్లామెడికల్ అండ్ హెల్త్ జెఎసి సమావేశం ఎన్జీవో జిల్లా కార్యదర్శి జివిఆర్ కిషోర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అనుచితంగా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి. వెంటనే క్షమాపణలు చెప్పాలి, జివో 143ను రద్దు చేయాలి, వెంటనే బదిలీలు చేపట్టాలని, పెండింగ్ ప్రొమోషన్స్ ఇవ్వాలని. యాప్‌లు తగ్గించాలని, ఫీల్డ్ స్టాఫ్ కి ఎఫ్ ఆర్ ఎస్ మినహాయింపు ఇవ్వాలని నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు, వివిధ సంఘాల సభ్యులు బి చిన్నమ్మి. బి పుష్ప ఎస్ లలితకుమారి, జయలక్ష్మి, భవాని, కె.రాణి, జ్యోతి లక్ష్మి, దుర్గా ప్రసాద్, జయగౌడ్, పార్వతి, రవణమ్మ, జిల్లా వ్యాప్తంగా మెడికల్, హెల్త్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి ఎన్జీవో జిల్లా కార్యదర్శి కిశోర్

అనుచిత వ్యాఖ్యలు సరైనవి కాదు

గరుగుబిల్లి : ఎంఎల్‌హెచ్‌పిలు తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని స్థానిక పిహెచ్‌సి వద్ద మంగళవారం ఎఎన్ఎంలు, సూపర్ వైజర్లు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బి.చిన్నమ్మ మాట్లాడుతూ తమలాంటి ఉగ్యోగులను కించపర్చేలా సోషల్ మీడియా వేదికగా చేసిన అనుచిత వాక్యాలను ఖండిస్తూ ఈ నిరసన చేపడుతున్నామన్నారు. ఎంఎల్‌హెచ్‌పిలు తమ హక్కుల కోసం ధర్నా చేయడం తప్పుకాదని, కానీ మిగతా క్యాడర్లను కించపరిచేలా మాట్లాడడం సరైన పోరాటం కాదని అన్నారు. ఎఎన్ఎంలు, సూపర్‌వైజర్లు లక్షలాది రూపాలు వేతనాలు తీసుకుంటున్నారంటూ చేసిన వాక్యాలు తోటి ఉద్యోగస్తులను కించపరిచేలా ఉన్నాయన్నారు. తమ డిమాండ్లను సాధించుకొలా ఎంఎల్‌హెచ్‌పిలు పోరాటం చేయలే తప్ప ఇలా ఇతర ఉద్యోగులను కించపర్చేలా వ్యాఖ్యలు చేయకూడదని హితవు పలికారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్. దుర్గాప్రసాద్, సిహెచ్ ఉదయకుమారి, ఎవి రవణమ్మ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జయరాజు, ఎస్ఐ (ఇన్‌సెట్‌లో మృతుడు విజయానంద్)

బైక్‌పై ప్రమాదంలో విఆర్ఒ దుర్మరణం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బైక్‌పై వెళ్తూ విఆర్ఒ మృతి చెందిన సంఘటన మన్యం జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే జియమ్మవలస మండలం వనిజకు చెందిన మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు తమ్ముడు నిమ్మక విజయానంద్ (51) బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. విజయానంద్ స్వగ్రామం వనిజ. కాగా కొంతకాలంగా పార్వతీపురంలో నివాసం ఉంటూ అక్కడ నుంచి ఉద్యోగరీత్యా వీరఘట్టం మండలం కత్తులు కవిటి విఆర్ఒగా పనిచేస్తున్నారు. ఆదివారం వనజలో ఓ శుభకార్యానికి వెళ్లి రాత్రి అక్కడే ఉండి సోమవారం ఉదయం బయలుదేరి తన పల్సర్ బైక్‌పై వస్తుండగా సుమారు 6.45 నిమిషాల సమయంలో తురకనాయుడవలస -ఇటుక గ్రామాల మధ్య ఆర్ అండ్ బి రహదారిపై ప్రమాదం జరిగింది. తురక నాయుడువలసకు చెందిన గొర్లి సురేష్ ఎప్పటిలాగే వాకింగ్‌కు వెళ్తూ తిరిగి వస్తుండగా విజయానంద్ వెనుక నుండి వచ్చి సురేష్‌ను ఢీకొనడంతో బండి అదుపుతప్పి బైక్ హ్యాండ్‌లో విజయానంద్ తల ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన తో ఒక్కసారి గా ఆందోళన చెందిన సురేష్ తన తమ్ముడికి ఫోన్ చేసి తెలియజేయడంతో తురకనాయుడువలస నుంచి గ్రామస్తులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని జియ్యమ్మవలస పోలీసులకు సమాచారాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్యే జయరాజు తమ్ముడు మృత దేహం పరిశీలించారు. అనంతరం ఎస్ఐ ఎన్.ప్రశాంత్ కుమార్ తన సిబ్బందితో వచ్చి జరిగిన ఘటనపై ఆరా తీశారు. అనంతరం గొర్లె సురేష్‌ను 108 సహాయంతో చికిత్సకు ఏరియా ఆసుపత్రికి తరలించి విజయానంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. విజయానంద్‌కు నిమ్మక భారతి, నిమ్మక సునీత ఇద్దరు భార్యలు, మానస, కీర్తన, గీతిక ముగ్గురు కుమార్తెలు, కుమారుడు పోషిత్ ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విఆర్ఒ మృతికి సంతాపం

వీరఘట్టం : మండలంలోని తూడి గ్రామ సచివాలయానికి చెందిన విఆర్ఒ నిమ్మక విజయనంద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, సిబ్బంది సంతాపం తెలిపారు. విజయానంద్ మృతి జీర్ణించుకొలేనదన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గిరిజన విద్యార్థుల ప్రతిభ అభినందనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో మన్యం గిరిజన విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కొనియాడారు. టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల ఉండడంతో పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు దోహదపడ్డాయని, రాష్ట్రస్థాయిలో గుమ్మలక్ష్మీపురం పేరు వినిపిస్తుందని అన్నారు. దీనిలో ఉపాధ్యాయుల కృషి కూడా ఎంతగానో ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలు సాధించారంటే ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత, ప్రోత్సాహం, ఉపాధ్యాయుల ఉత్తమ బోధన, పాఠశాలల్లో సౌకర్యాలు కల్పన కారణం అన్నారు. మూడోసారి జిల్లాకు పేరు రావడం హ్యాట్రిక్‌గా వర్ణించారు. భవిష్యత్తులో కూడా చదువు పట్ల ఆసక్తి కనబరిచి ఉద్యోగాల్లో స్థిరపడాలని, తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని సూచించారు. అత్యధిక మార్కులు సాధించిన 39 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించి సత్కరించారు. విశ్రాంత డిఇఒ ఎన్.తిరుపతినాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుకోవాలనే సంకల్పం ఉన్ననాడే మంచి విద్యార్థులుగా సమాజంలో గుర్తింపు పొందగలరని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ జ్ఞాన ప్రకాష్, ఎంపిడిఒ సాల్మన్ రాజు, తహశీల్దార్ శేఖర్, ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్, ఎంఇఒ 1,2లు చంద్రశేఖర్, బిడ్డిక భీముడు, విశ్రాంతి ఉపాధ్యాయులు హరిప్రసాద్, జగన్నాథ్ రథో, 13 పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు రహదారి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

జియ్యమ్మవలస ఆర్ అండ్ బి రహదారి నుంచి గెడ్డతిరువాడ పంచాయతీ చిలకలవానివలస మీదుగా పసుపువానివలస వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపిపి బొంగు సురేష్ తెలిపారు. జియ్యమ్మవలస మండలంలో గల కూటమి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసిన ఎమ్మెల్యే జగదీశ్వరి



సమావేశం నిర్వహించాలంటూ కమిషనర్‌ను కోరుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాలు నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కమిషనర్ ఛాంబర్‌కు వెళ్లి కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆమె కమిషనర్‌తో మాట్లాడుతూ మూడు నెలలుగా మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించకపోవడం వల్ల ఎక్కడ బిల్లులు అక్కడే ఆగిపోయాయని, పట్టణంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ఈ పద్ధతి సరికాదని వెం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని పార్టీలకు అతీతంగా వెంటనే నిర్వహించాలని అన్నారు. కమిషనర్ స్పందిస్తూ త్వరలోనే కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

త్వరలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 5న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన 'తప్పని తాగునీటి కష్టాలు' అన్న వార్తపై ఆయన స్పందిస్తూ పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలో పరిధిలో రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా చేస్తున్నామని అన్నారు. మంచినీటి సరఫరా జరగని ప్రాంతాల్లో పురపాలక సంఘ వాటర్ ట్యాంకరు ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమస్యను పూర్తిగా నిర్మూలించుటకు యుఐడిఎఫ్ ప్రాజెక్టు ద్వారా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ద్వారా త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.



పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

పారిశుధ్య పనులపై కమిషనర్ ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులపై మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పారిశుధ్య కార్మికులు చేస్తున్న పారిశుధ్య నిర్వహణ పనులను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ పార్వతీపురం దిశగా పట్టణాన్ని ఉంచేందుకు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సూచించడం జరిగిందని, దీనిలో భాగంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ప్రతిరోజు అన్ని వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షిస్తామని, ఈ దిశగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో పాటు పట్టణ ప్రజలు తమ వంతు దిశగా కృషి చేయాలని స్వచ్ఛ పార్వతీపురం కోసం, తమ చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు బాధ్యత వహించాలని ఉన్నారు.

ఎస్‌డబ్ల్యు పిసి కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సూరంపేట, అంటిపేట గ్రామాల్లో ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలను ఇఒపిఆర్‌డి కె కుమార్‌వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక వనరులను సేకరించి దీంతో గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవిఐ సత్యనారాయణ

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - కురుపాం

రహదారి భద్రతా నియమాలు పాటించి వాహనాలు నడపాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ నగర్ జంక్షన్ వద్ద ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు పొల్యూషన్, బ్రేక్ డౌన్ తదితర పత్రాలను క్షుణంగా పరిశీలించి ధ్రువీకరణ పత్రాలు లేకుండా నడుపుతున్న వాహనదారులకు అపరాధ రుసుం వేశారు. అనంతరం వాహనదారులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు తప్పనిసరిగా టార్పను కప్పి తీసుకువెళ్లాలని, లేకుంటే వెనుక నుండి ఇచ్చే వాహనదారులకు ఇసుక కంట్లో పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ సిబ్బంది వి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం గోడ పై జాయింట్ సర్వే

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధోనుబాయి దుర్గమ్మ గుడి ఆలయం గోడపై రెవెన్యూ, అటవీశాఖ మంగళవారం సమనయంతో సర్వే చేపట్టారు. ఇటీవల ధోనుబాయిలో బంగ్లా, దుర్గమ్మ ఆలయం గోడ నిర్మాణంపై అటవీ శాఖ అభ్యంతరాలు తెలపడంతో సర్పంచ్ కూరంగి వెంకి నాయుడు గ్రామస్తులు కలిసి గోడ నిర్మాణం కోసం అనుమతులు ఇప్పించాలని ఐటిడిఎ పిఒ గ్రీవెన్స్‌లో వినతి సమర్పించారు. పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి స్పందించి అటవీ, రెవెన్యూ శాఖ సర్వే చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పిఒ ఆదేశాల మేరకు మంగళవారం అటవీశాఖ రెవెన్యూ శాఖ జాయింట్ సర్వే చేపట్టారు. ఆలయం గోడ కొలతలు వేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పలరాజు, ఆర్ఐ విజయ, గణేష్, సర్వేయర్ శంకర్రావు, మోహన్‌రావు, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వికాసానికి ఆటలు మేలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విద్యార్థుల వికాసానికి ఆటలు ఎంతో విలువైనవని స్థానిక శాఖా గ్రంథాలయం నిర్వహకులు నల్ల మధుసూదనరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థులకు కథలు, స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు, ఇంగ్లీష్ గ్రామర్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ శిక్షణకు స్థానికమండల పరిషత్ ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ శిక్షణా శిబిరంలో విద్యార్థులకు కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, ఆటల పోటీలు తదితర కార్యక్రమాలను ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కావున ఈ వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



వేతనదారులకు శీతల పానీయాలను అందజేస్తున్న కోటేశ్వరరావు

వేతనదారులకు శీతల పానీయాలు వితరణ

ప్రజాశక్తి - కురుపాం

జియమ్మవలస మండలం తాళ్లడుమ్మ, దాసరి పేట గ్రామల్లో గల వేపకర్ర చెరువు, అకరం బంధ చెరువుల్లో పని చేస్తున్న ఉపాధి హామీ వేతనదారులకు రాష్ట్ర కళింగ వైశ్య గౌరవ అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు మంగళవారం పని వద్దకు వెళ్లి శీతల పానీయాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో వేతనదారులు పడుతున్న ఇబ్బందులు చూసి శీతల పానీయాలు అందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వేతనదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇంకెన్నో చేయాలని కోరినట్లు తెలిపారు.

బలిజిపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

బలిజిపేట : మండల కేంద్రమైన బలిజిపేటలో సత్య సాయి సేవా సమితి కన్వీనర్ వెలిది సుబ్బారావు ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య బృందం కంటి శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథితులుగా బలిజిపేట వైద్యాధికారులు కిరణ్మయి, వివి రమణ, పెదపెంకి నేతాజీ గ్రంథాలయం స్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు సమక్షంలో నిర్వహించారు. క్యాంపు కో ఆర్డినేటర్ వెంకట్ రమణ సాయి సమితి సభ్యులు బొంతల కోటి నారాయణరావు మాస్టారు, ఆశా కార్యకర్తలు సాయి సభ్యులు శిబిరం విజయవంతవ్వడానికి కృషి చేశారు. 50 మందికి తనిఖీలు చేయగా 27 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు చేసి తిరిగి బలిజిపేట తీసుకు వస్తామని క్యాంపు కో ఆర్డినేటర్ వెంకట్ రమణ తెలిపారు.

ఆశాలకు కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి - మక్కువ

ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించి, కనీస వేతనం అమలు చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చేయాలని, 62 ఏళ్లకు రిటైర్మెంట్ వయస్సు పెంచాలని, రిటైర్ అవుతున్న వారికి బెనిఫిట్స్, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మక్కువ, శంబర పిహెచ్‌సిల వైద్యాధికారులకు వినతి పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా మార్చాలని, ఆశాలతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్‌తో మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం నాయకులు కె.లక్ష్మి, కె.సీత, బి.కామేశ్వరి, పి.జ్యోతి, ఎ.జానకి, ఎం.మంగ, ఎస్.విజయ, గౌరీ, కృష్ణవేణి, కృపావతి, యశోద, మంజుల, సరోజిని, సిహెచ్‌డబ్ల్యు నాయకులు ఉషారాణి, లక్ష్మి, విజయలక్ష్మి, నవీన, రేవతి, నిర్మల, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ వై నాయుడు, మండల కార్యదర్శి జి.కృష్ణ పాల్గొన్నారు.

సాలూరురూరల్ : లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సాలూరు మండల ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు మామిడిపల్లి, బాగువలస, తోణాం పిహెచ్‌సి ఆసుపత్రి వైద్యాధికారులకు సార్వత్రిక సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్వరి, శ్రీదేవి, ఆదిలక్ష్మి, రమణమ్మ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రశాంతి లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మర్రి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి ఎన్.ఎ.నాయుడు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు పెదగొండపల్లి, బందలుపి, డోకి శిలా పీహెచ్‌సీ వైద్యాధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు శాంతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



మక్కువలో సమ్మె నోటీసును అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

సీతానగరం : మే 20న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామంటూ స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారికి సిఐటియు ఆధ్వర్యాన ఆశా కార్యకర్తలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, రెడ్డి లక్ష్మి, టి.పార్వతి, పి.మంగమ్మ, సిహెచ్.శ్రావణి, గౌరమ్మ తదితర ఆశాలు పాల్గొన్నారు.

కొమరాడ : మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. కొమరాడ, మాదలింగి, కూనేరు రామభద్రపురం పిహెచ్‌సిల వైద్యాధికారులకు సమ్మె నోటీస్ అందజేశారు. వినతిని అందజేసిన వారిలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, గంగ, హైమా, మంగ, పార్వతి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు దుర్గ, రాధ, మూడు పిహెచ్‌సిల్లో పని చేస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

సాలూరు: ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని సాలూరు ఆశావర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు స్థానిక ఏరియా హాస్పిటల్ పిపి యూనిట్ అధికారికి సమ్మెనోటీసులను అందజేశారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు అందజేత

పార్వతీపురం టౌన్ : మే 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మిక, కర్షక సమ్మెలో పాల్గొంటామంటూ పారిశుధ్య రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికులు మున్సిపల్ శానిటరీ సూపర్వైజర్ రామారావుకు సమ్మెను నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని, రెగ్యులర్ ఉద్యోగులకు పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలనే డిమాండ్లతో మే 20న దేశ వ్యాప్త కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందని ఈ సమ్మెను జయప్రదం చేసేందుకు అన్ని రంగాల కార్మికులు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు సింహాచలం, శంకరరావు, రవి, గంగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పాలకొండ కమిటీ స్థానిక నగర పంచాయతీ కమిషనర్ రత్నం రాజుకు సమ్మె నోటీసులు అందించారు. నోటీసును అందించిన వారిలో సిఐటియు మండల కార్యదర్శి కె.రాము, యూనియన్ కార్యదర్శి, కోశాధికారి టి.వేణు కార్యవర్గ సభ్యులు విమల, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం నాయకులు రామలక్ష్మి, రాధా, అనిత, మాధవి, సుబ్బలక్ష్మి, వెంకటలక్ష్మి, గోవిందమ్మ, అప్పలకొండ, సిఐటియు నాయకులు ఎన్‌వై.నాయుడు., తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని కోరుతూ ఆశ వర్కర్స్ యూనియన్ పాచిపెంట మండల కమిటీ నాయకులు జలుమూరు చండీప్రియ, పి.మంజుల ఆధ్వర్యంలో పాచిపెంట పిహెచ్‌సి వైద్యాధికారి రవిచంద్రకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలకు నిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ అవసర వైద్య సేవ అందించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆశాడే సందర్భంగా ఆశా వర్కర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లు గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల వివరాలను ఈ ఆశ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆస్పత్రిలో ఉన్న అన్ని రికార్డులను పరిశీలించారు. ఆశాల వద్ద ఉన్న రికార్డులు సక్రమంగా నమోదు ప్రక్రియ జరగాలని, ఎటువంటి నిర్లక్ష్యం జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులు పొందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ల్యాబ్‌లో చేస్తున్న పరీక్షల్లో వివరాలను ఆరా తీసి పిహెచ్‌సి పరిసరాలను పరిశీలించారు. ఉపాధిహామీ వేతనదారులకు వడదెబ్బ, డీహైడ్రేషన్‌కు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆరోగ్య కేంద్రాలు, గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉండాలని, వేసవి సంబంధిత రుగ్మతలు గుర్తిస్తే తగు చికిత్స అందజేసి వివరాలు నమోదు చేసి జిల్లా ఆరోగ్య కార్యాలయానికి తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



రీసర్వే పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఏజెన్సీలో సబ్ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు ఏ దశలో ఉన్నాయి, వినియోగిస్తున్నదీ, లేనిదీ వంటి అంశాలను పరిశీలించేందుకు వచ్చినట్లు పాలకొండ సబ్‌కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట సచివాలయ భవనాలను పరిశీలించారు. సచివాలయం భవన నిర్మాణం పూర్తయినా నేటికీ కాంట్రాక్టర్ సిమెంట్ బిల్లులు అందలేదని సర్పంచ్ గౌరీ శంకర్రావు సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. అలాగే గొరడలో జరుగుతున్న భూ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి సర్వే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్ శేఖర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కోటిపాం బ్రిడ్జిని పట్టించుకోరా? : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కోటిపాం సమీపాన జంఝావతి నదిపై ఉన్న బస్సు వంతెన పూర్తిగా శిథిలావస్థలో ఉందని, దీని బాగుకోసం ఎవరూ పట్టించుకోరా అంటూ సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. పూర్తిగా గోతులమయంగా ఏర్పడిన బస్సు వంతెనను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో పారాది వంతెన మాదిరిగా కోటిపాం బ్రిడ్జి కూలిపోతే గానీ అధికారులు, పాలకులు పట్టించుకోరా అని ప్రశ్నించారు. గతంలో కోటిపాం బ్రిడ్జి వద్ద ధర్నా చేసి నేపథ్యంలో రూ.10 కోట్ల 30 లక్షలు బ్రిడ్జి మరమ్మతు పనులు కోసం ప్రతిపాదన పంపామని ఆర్అండ్‌బి అధికారులు చెప్పారని, అయితే ఇందుకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయా, లేదా అన్న విషయాన్ని వెంటనే అధికారులు తెలియజేయాలని కోరారు. పారాది బ్రిడ్జి మాదిరిగా కూలిపోతే గాని కొమరాడ వైపు వస్తున్న అధికారులకు గానీ, పాలకులు గానీ ఈ బ్రిడ్జి కనిపించడం లేదా అని అన్నారు. ఈ ఆ బ్రిడ్జి పైన పెద్దపెద్ద గోతులు ఉండడంతో ఆ గోతుల్లో వర్షానికి నీరు చేరడంతో ఆ గోతుల్లో అనేకమంది వాహన దారులు పడిపోయి కాళ్లూ, చేతులు విరిగిపోయి ఆసుపత్రి పాలవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిపై ఏర్పడిన గోతులు కప్పి ప్రమాదాలను నివారించాలని కోరారు.



పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణారావు

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపాలిటీ పరిధిలో గల ఆరో వార్డు కోటవీధి జంక్షన్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులను మంగళవారం పరిశీలించారు. పట్టణంలో సంబంధించి కోటవీధి జంక్షన్, దగ్గర వీధుల్లో నీటి సరఫరా చేసే పైప్ లైన్లు బ్లాక్ కావడంతో తాగునీటి సరఫరా లేనందున, అక్కడ ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, డిఇ ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, అక్కడికి వెళ్లి స్థానికులతో మాట్లాడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వెంటనే వాటర్ బ్లాక్ అయిన, వాటర్ పైపులైన్లలను క్లియర్ చేసి తక్షణమే నీటిసరఫరా అయ్యేలా తగు చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. శ్యామలాంబ అమ్మవారు పండుగ జరగనున్న నేపథ్యంలో పారిశుధ్య పనుల్లో భాగంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకష్ణ సిబ్బందితో శానిటేషన్ పనులు చేపట్టారు. లారీఓనర్ యూనియన్ ఆఫీస్ నుంచి గాంధీనగర్ బ్రిడ్జి వరకు ఇరుపక్కల పెరిగిన పిచ్చిమొక్కలు, మట్టిదిబ్బలను తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

కుసిమి ఆస్పత్రి ప్రాంగణంలో చలివేంద్రం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చాందిని ఆధ్వర్యంలో ఆసుపత్రి ముఖద్వారం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. మంచినీళ్లు మజ్జిగ ఒఆర్ఎస్ ఏర్పాటు చేసి వేసవి తాపం నుంచి కొంత ఉపశమనం కలిగించారు. ఎండలు భగభగ మాడటంతో దృష్ట్యా ప్రజల, రోగుల దాహాన్ని తీర్చడానికి దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివశంకర్, రత్నం వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సమీకృత దాణా పంపిణీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు 50 శాతం రాయితీపై సమీకృత దాణా పంపిణీ చేస్తున్నట్టు మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలుపు రేషన్ కార్డు ఉన్న పాడి రైతులకు రాయితీపై సమీకృత దాణాను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే భారత్ పశు ధన్ యాప్‌లో రైతులకు సంబంధించిన పేర్లు నమోదై ఉండాలన్నారు. సమీకృత దాణా కావాల్సిన పాడి రైతులు రైతు సేవా కేంద్రంలో లేదా పశు సంవర్ధక శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. 50 కిలోల సమీకృత దాణా బస్తా ధర రూ.1110 కాగా, సబ్సిడీ పోనూ రూ.555 రైతులు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక రైతుకు ఒక బస్తాను మాత్రమే అందజేస్తున్నామని, కావున పాడి రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభ గల యువతకు సదావకాశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేటలో నీలమ్మ తల్లి పండుగ మహోత్సవాల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో (కళాకారులు) సంస్కృతిక కార్యక్రమాల్లో (డ్యాన్స్, భరత నాట్యం, మేజిక్ షో) ప్రతిభగల యువతకు సదావకాశం కల్పిస్తున్నట్లు ఎల్విన్‌పేట సర్పంచ్ చైతన్య స్రవంతి తెలిపారు. ఈనెల 6,7,8,9 తేదీల్లో మాత్రమే ప్రదర్శనలు నిర్వహిస్తామని అన్నారు. ఈ మేరకు ఆసక్తి గల యువతి యువకులు మీ ప్రదర్శనను ఉచితంగా తాము ఏర్పాటు చేసిన స్టేజ్ మీద ప్రదర్శించి మీ ప్రతిభను చాటుకోగలరని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న దలచిన యువత మీమీ రికార్డులను మీరే తెచ్చుకోవాలని అన్నారు.

నాయీ బ్రాహ్మణుల రక్షణకు చట్టం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

నాయీ బ్రాహ్మణులకు కుల వివక్ష లేకుండా సామాజిక రక్షణ చట్టం పటిష్టంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి దుర్గారావు మాట్లాడుతూ గ్రామాల్లో నాయీ బ్రాహ్మణులపై కుల వివక్షత ఎక్కువగా ఉందని, కులం పేరుతో పిలవడం, సామెతల పేరుతో అవమానించడం, దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయనాయకులతో పాటు టివి కార్యక్రమాల్లోనూ అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో రక్షణగా జిఒ 50ను విడుదల చేసినా తమకు న్యాయం జరగడం లేదన్నారు. జీవో 50 పటిష్టంగా అమలయ్యేలా చట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చీపురుపల్లి గౌరీశ్వరరావు, అలుగోలు సింహాచలం, రాయగడ ఫకీర్, ఆర్. పోలీస్, మరదన ప్రసాద్, మరదన అనీల్, అలుగోజీ శ్రీరాములు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - కురుపాం

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాలైన కెరడ, వనజ, వలవ, సుళవ తదితర గ్రామాల్లో అక్రమంగా నాటుసారా తయారీ చేస్తున్నట్లు ముందస్తు సమాచారంతో ఏపీ, ఒడిశా ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 460 లీటర్ల నాటుసారాతో పాటు, 9,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల ప్రజలకు అక్రమంగా నాటుసారా తయారీ చేసినా, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో కురుపాం, విజయనగరం, రాయగడ, సీతానగరం, సాలూరు ఎక్సైజ్ అధికారులు రామచంద్రకుమార్, పద్మావతి రాజేశ్వరి, రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయంగా సర్వేలు

ప్రజాశక్తి - మక్కువ

ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించి సర్వే పక్కగా చేపట్టాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. మక్కువ, శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సేవలు అందుతున్న తీరు, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించి ప్రగతి నివేదికలను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో జ్వరాలు గుర్తించడంలో జాప్యం ఉండరాదని ఫీవర్ సర్వే పక్కగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే సత్వరమే తెలిజేయడంలో ఆశా కార్యకర్తలు క్రియాశీలకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జి.హరికృష్ణ, డాక్టర్ ఎంవి కిరణ్ కుమార్, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, సూపర్వైజర్లు నిర్మల, రాజశేఖర్, విజయలక్ష్మి, రత్నం, సరస్వతి వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నవధాన్యాల ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి - పాచిపెంట

భూ సారం పెరగడానికి అత్యుత్తమ మార్గం నవధాన్యాలను సాగు చేసి కలియ దున్నడమే అని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని మంచాడవలసలో గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్ ఆధ్వర్యంలో నవధాన్యాలు వేద్దాం భూ సారాన్ని పెంచుదాం అనే నినాదంతో భూ సారాన్ని పెంచడంలో నవధాన్యాల పాత్రపై సామూహిక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి పంట అనుసంధానానికి నవధాన్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని, పశువులకు కావాల్సిన పశు గ్రాసం, ఇంటికి కావాల్సిన ఆకుకూరలు, కూరగాయలు కూడా నవధాన్యాల సాగు ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపారు. భూమి లోపల ఉన్న నవధాన్యాల్లో ఉన్న వివిధ పంటల వేరు వ్యవస్థలు అనేక రకాల సూక్ష్మజీవులకు నిలయంగా మారి భూమిలో ఉన్న అనేక రకాల పోషకాలను వేరు వ్యవస్థ వద్దకు అందుబాటులోనికి తీసుకురావడం ద్వారా పంట దిగుబడి పెరగడమే కాకుండా నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. అన్ని పంటలకు ముందుగా నవధాన్యాలు వేసి సాగు చేయడం కలుపు ఉధృతి తగ్గుతుందని తెలిపారు. నేల కోత నుంచి భూములను రక్షించడానికి నవధాన్యాలు ఎంతగానో ఉపకరిస్తాయి కాబట్టి రైతులంతా తప్పనిసరిగా వీటి సాగు చేసి కలియ దున్నాలని కోరారు. అనంతరం గ్రామమంతా నినాదాలతో తిరిగి ప్రతి రైతుకు నవధాన్యాల లాభాలను వివరించారు. అనంతరం పాంచాలిలో నవధాన్యాల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నవధాన్యాలు చల్లడం ద్వారా కలుపు చాలా వరకు తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో వివిఎలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేలతల్లి బాగుకోసం నవధాన్యాలు సాగు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నేలతల్లి బాగు కోసం నవధాన్యాలు మొలకలు దుక్కి చేస్తే నేలకు బలం చేకూర్చడంతో పాటు రసాయనాల వినియోగం తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయం ఎఆర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని డోకిశిలలో మంగళవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి ఆరోగ్యం, మన ఆరోగ్యం, భావి తరాలు మనుగడ సాగాలంటే ప్రకృతి వ్యవసాయం చేయాలని అన్నారు. భూమి నిరంతరం ఏదో ఒక పంటతో కప్పి ఉంచాలని, దీనివల్ల భూమి తేమగా ఉండి, నీటి సామర్థ్యం కలిగి ఉంటుందని అన్నారు. వాన పాములు అభివృద్ధి చెందుతాయని, దిగుబడులు అధికంగా వస్తాయని వివరించారు. నవధాన్యాలు వేసుకుని అందులో ఆకుకూరలు, బెండ, ముల్లంగి పంటలు తీసుకుని మిగిన పంటలు పశువులకు మేతగా ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనింగ్ వై.శ్రీరాములు, విఎ ప్రసన్న, యూనిట్ ఇన్చార్జి ఎన్.రమణమ్మ, జి.తవుడు, ఐసిఆర్‌పి వెంకటనాయుడు, సరస్వతి, అప్పలనరసమ్మ, సరస్వతి, అనసూర్య, చంద్రశేఖర్, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మక్కువ



మృతుడు అప్పలనాయుడు

మండలంలోని చెముడు గ్రామపంచాయతీ సమీపాన ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలు ప్రకారం సాలూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కలిగి అప్పలనాయుడు(55) బొబ్బిలిలో జరుగుతున్న గ్రామ దేవత ఉత్సవాలు కోసమని చెప్పి తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై బయలుదేరి చెముడులో తన బంధువైన పత్తిగొల్లి సరస్వతి, మరో చిన్న పిల్లడిని ఎక్కించుకొని మక్కువ వస్తున్నాడు. అదే క్రమంలో మక్కువ నుంచి చెముడు వైపు వెళ్తున్న మరో బైకు నడుపుతున్న వ్యక్తి నిర్లక్ష్యం వ్యవహరించడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అప్పలనాయుడు తలకు గాయం తగలడం మృతి చెందాడు. వెనుక కూర్చొన్న సరస్వతి, ఆమె మనవడికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెడీమేడ్ షాపు దగ్ధం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలో సోమవారం అర్ధరాత్రి మేదరి వీధి కూడలి వద్ద ఉన్న రెడీమేడ్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. చుట్టుపక్కల ఉన్న స్థానికులు 12:30 గంటలకు అధికారులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులో చేశారు. షాపు పై అంతస్తులో కూడా మంటలు వ్యాపించి రెడీమేడ్ వస్త్రాలను దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది చొరవతో మంటలను అదుపు చేశారు. సుమారు రూ.25 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లే అవకాశం ఉందని అగ్నిమాపకధికారి శ్రీనుబాబు తెలియజేశారు.